క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని టౌన్–1 గాంధీచౌక్ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ శివాలయం రోడ్ ఫీడర్ విద్యుత్ మరమ్మతులు, లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ మౌర్విక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఎమ్మార్వో ఆఫీస్ రోడ్, సాయిరాం థియేటర్ రోడ్, మోతీనగర్, బొక్కలగడ్డ, పంపింగ్‌వెల్ రోడ్, ఫిల్టర్ బెడ్, ఆటోస్టాండ్, పెద్దమ్మ తల్లి గుడి ప్రాంతాల్లో కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు హైమాస్ట్ లైట్లు ప్రారంభం

రఘునాథపాలెం: మండలంలోని 37 గ్రామ పంచాయతీల పరిధిలో 40 గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు వెలుగులు అందించబోతున్నాయి. సుడా నిధులు నుంచి మొత్తంగా రూ.1.40 కోట్ల నిధులు మంజూరు చేసి లైట్లు ఏర్పాటు చేయగా.. గురువారం రాంక్యాతండాతో పాటు మరో ఐదు గ్రామాల్లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించనున్నారు. ఇప్పటికే పరికలబోడు, పంగిడి గ్రామాల్లోని లైట్లను సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ ప్రారంభించారు. కాగా, పెద్ద గ్రామాల్లో రెండు లైట్లు ఏర్పాటు చేశారు.

రేపు మత్స్య సొసైటీ ఎన్నికలు

నేలకొండపల్లి: చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి రేపు(శుక్రవారం) ఎన్నికల జరగనున్న నేపథ్యాన క్యాంపు రాజకీయాలు వేదికగా మారింది. మొత్తం 9 డైరెక్టర్ల పోస్టుల్లో ఎస్టీ కేటగిరికి చెందిన విభాగం నుంచి మంగాపురంతండాకు చెందిన దీరావత్ రాధాకృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా.. మరో 8 డైరెక్టర్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో రెండు ప్యానల్‌కు చెందిన 19 మంది బరిలో నిలిచారు. ఈ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మొత్తం 832 ఓటర్లకు బుధవారం క్యాంపులోమాక్ పోలింగ్ నిర్వహించారు.

నియామకం

తిరుమలాయపాలెం: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శిగా మండలంలోని దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన సోమనపల్లి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. బుధవారం ఈమేరకు పార్టీ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తన ఎంపిక పట్ల కృతజ్ఞతలు తెలపుతూ.. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులు, ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తేందుకు కృషి చేస్తానని తెలిపారు.

విద్యుత్ మోటార్లు చోరీ

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన మాధవరావు, వజ్జా రాధాకృష్ణమూర్తికి పాలేరు పాత కాలువ 25వ తూము వద్ద విద్యుత్ ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారు. కాగా, మాధవరావుకు చెందిన రెండు మోటార్లు, రాధాకృష్ణమూర్తికి చెందిన ఒక మోటార్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. వారం రోజుల కిందట ఇదే కాలువపై వజ్జా మూర్తి, వజ్జా శ్రీను, వి.నాగేశ్వరరావుకు చెందిన మోటార్లు ఒకే రోజు చోరీకి గురైన విషయం విదితమే.

కట్టెల విషయంలో ఘర్షణ

రఘునాథపాలెం: మండలంలోని హర్యాతండాలో ఇంటి పక్కన కట్టెల విషయంలో బుధవారం జరిగిన ఘర్షణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన బానోత్ వెంకటేశ్ పొలం పనికి వెళ్లి ఇంటికి వచ్చాడు. ఇంటి పక్కనే ఉన్న బాబాయి బానోత్ మోహన్ కట్టెల విషయంలో ఘర్షణ పడ్డారు. ఈఘర్షణలో మోహన్ వెంకటేశ్‌పై కర్రతో కొట్టడంతో తలకు బలమైన గాయమైంది. ఈ విషయమై బాధితుడి తండ్రి వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువత ప్రతిజ్ఞ

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని జిల్లా నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యాన మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా యువతతో ప్రతిజ్ఞ చేయించారు. బుధవారం నిర్వహించిన ర్యాలీ సందర్భంగా ప్రతి యువతీ,యువకులు ఇందులో భాగస్వాములు కావాలని నెహ్రూ యువక కేంద్రం అధికారి అన్వేష్ పిలుపునిచ్చారు. ర్యాలీని పురస్కరించుకుని మట్టి, బియ్యం సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే వలంటీర్ కనేకంటి నాగాచారి, పువ్వాడ నగర్ జాగృతి యువత అధ్యక్షులు సయ్యద్ షారుఖ్, ఇమ్రాన్, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మార్క్ ఆంటోని
వినోద	జవాన్(హిందీ), జైలర్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	జైలర్
శ్రీనివాస	జవాన్
సుందర్	ఖుషి

– ఖమ్మంగాంధీచౌక్

కాలనీల్లో తాగునీటి కష్టాలు..!

5వ డివిజన్‌లో భగీరథ జలం.. మురుగు కాల్వపాలు

- తాగునీరు అందక అవస్థలు
- మూడు నెలలుగా వృథాగా పోతున్న నీరు
- పలుమార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- తాగునీటి కోసం ప్రజల ఎదురుచూపులు



5వ డివిజన్‌లో పైపులైన్ పగిలి వృథాగా పోతున్న భగీరథ నీరు

స్వచ్ఛమైన తాగునీటిని రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ సరఫరా చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికీ నల్లా కనెక్షన్లు వేయించింది. ఈ నేపథ్యాన భగీరథ నీరు ఇంటింటికీ సరఫరా అవుతున్నా.. సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. అంతేకాక పలు చోట్ల పైపులైన్‌కు లీకులు ఏర్పడడంతో సకాలంలో అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలకు తాగునీరు అందక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

ఖమ్మంఅర్బన్: నగరంలోని 5వ డివిజన్ యూపీహెచ్ కాలనీ, వేణుగోపాల్‌నగర్–2 పరిధిలోని చర్చి సమీపాన ఉన్నమిషన్ భగీరథ సరఫరా చేసే ప్రధాన పైపులైన్ పగిలిపోయింది. దీంతో తాగునీరంతా పక్కనే ఉన్న మురుగు కాల్వలో వృథాగా పోతోంది. కాగా, పైపులైన్‌కు మరమ్మతులు చేసేందుకు గత కొన్ని మాసాలు క్రితం సంబంధిత అధికారులు వచ్చి తవ్వకాలు చేపట్టారు కానీ మరమ్మతులు చేయకుండానే వదిలేశారు. దీంతో అక్కడ మరో సమస్య ఏర్పడింది. తవ్వకాలు చేపట్టిన రోడ్డు ఇరుకుగా ఉండడంతో పైపులైన్ గుంత రాకపోకలు సాగించేందుకు వీలుపడక మరో సమస్యను తెచ్చిపెట్టినట్లయింది. మిషన్ భగీరథ అధికారుల పనితీరు చూస్తుంటే.. ఒక సమస్యకు మరో సమస్య సృష్టిస్తున్నట్లు ఉంది. పైపులైన్ పగిలితే ఒకటి లేదా రెండు లేదా వారం రోజుల్లో మరమ్మతులు చేయాలి.. ఇలా నెలలు తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కళ్లముందే వృథా..

పైపులైన్‌కు పగిలిపోవడంతో రోజువారిగా సరఫరా చేస్తున్నా నీరు మురుగు కాల్వ పాలవుతోంది. దీన్ని చూస్తున్న కాలనీవాసులు తమ కళ్లముందే తాగునీరు వృథాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిని విడుదల చేసినంత సేపు కాల్వలో నీరు పారుతుండడంతో తాము మాత్రం దాహంతో అల్లాడుతుంటే నీరు ఇలా కాల్వపాలవుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని, తాగునీరు తమ కడుపు నింపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాగునీటి కోసం అల్లాడుతున్నాం..



గత నాలుగైదు నెలలుగా తమ ఇంటి పక్కన పైపులైన్ పగిలి తాగునీరు మురుగు కాల్వలో పారుతుంది. కానీ తాగునీటి కోసం మా కాలనీవాసులు అల్లాడిపోతున్నాం. నిత్యం ఇటుగా అధికారులు, ప్రజాప్రతినిధులు తిరుగుతున్నా మరమ్మతులపై దృష్టి సారించడం లేదు.

– బి.నాగమ్మ, గృహిణి, వేణుగోపాలనగర్–2

చర్యలు తీసుకోవాలి..



పైపులైన్ లీకుతో తమ ఇంట్లోకి నీరు రావడం లేదు. దీంతో గత కొన్ని నెలలుగా ఇబ్బంది పడుతున్నాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు మరమ్మతులు చేయించి తమకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

– వి.వీరన్న, కాలనీవాసి

పట్టించుకోవడం లేదు..



పైపులైన్ పగిలి కాలనీవాసులకు భగీరథ నీరు అందడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతులు చేపట్టడం లేదు. ప్రతిపక్ష పార్టీ కార్పొరేటర్ కావడంతోనే ఏమో గాని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– పల్లెబోయిన భారతిచంద్రం, కార్పొరేటర్

50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీ మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామని, బీసీ మహిళలకు ఉపకోట కల్పించకపోవటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అన్ని పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు బీసీలకు అందటం లేదని ఆరోపించారు. విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, రమేశ్, రమణకుమార్, మహేశ్, వెంకట్రామయ్య, ప్రకాశ్, పాపారావు, వేణు, నాగేశ్వరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తి

జయప్రదం చేయండి..

నేలకొండపల్లి: వచ్చే నెల 4న కేవీపీఎస్ ఆధ్వర్యాన నిర్వహించే మండల స్థాయి సదస్సును జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర నాయకుడు పి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పగిడికత్తుల నాగేశ్వరరావు, బొడ్డు మధు, వీరయ్య, మహేష్, ప్రసాద్, సత్యనారాయణ, భాస్కర్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

22,23న సెమినార్‌ను..

ఖమ్మంరూరల్: ఈనెల 22, 23 తేదీలలో ఖమ్మంలో జరిగే డీవైఎఫ్ఐ జిల్లా విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులను పురస్కరించుకొని మణిపూర్ మారణకాండ–దేశ రాజకీయం ఒక చిత్రం అనే అంశంపై జరిగే సెమినార్‌ను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్.బషీరుద్దీన్ తెలిపారు. బుధవారం వరంగల్‌క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ పాలనలో సామాన్యుడు బతకలేని పరిస్థితి నెలకొందని, మణిపూర్ మరణకాండపై ప్రధాని నోరుమెదపకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు పొన్నం మురళి, వట్టికోట నరేష్, తాటి వెంకటేశ్వర్లు, వీరభద్రం, సతీష్, పట్టాభి, వెంకట్రావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

23, 24న జిల్లా క్లాసులను..

నేలకొండపల్లి: ఈ నెల 23, 24 తేదీల్లో ఖమ్మంలో జరిగే డీవైఎఫ్ఐ జిల్లా శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణిపూర్ మారణకాండ దేశ రాజకీయ ముఖచిత్రం అనే సెమినార్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బొడ్డు మధు, నరసింహారావు, రాసాల నవీన్, నాగేంద్రబాబు, సూర్యనారాయణ, నగేష్, కే.వీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోనల్ క్రీడలు ప్రారంభం..



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈఓ

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో ఈ నెల 23 వరకు నిర్వహించనున్న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ వంటి జోనల్ క్రీడలను (స్కూల్ లెవల్) బుధవారం ఎంఈఓ ఎం.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో గెలుపు, ఓటములు సహజమని, స్నేహపూరిత వాతావరణంలో పోటీలు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ రాజశేఖర్, గేమ్స్ కన్వీనర్ శంకర్‌రావు, పాఠశాల కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌కు వినతి

ఖమ్మంమయూరిసెంటర్: 32వ డివిజన్ పరిధిలోని డీసీఎంఎస్ గోడౌన్ నుంచి విపరీతంగా ముక్క పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని, చాలా ఇబ్బందులు పడుతున్నామని మేయర్ పునుకొల్లు నీరజకు స్థానికులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ముక్క పురుగుల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మేయర్ సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. మేయర్‌ను కలిసిన వారిలో ఈశ్వరలింగం, జగదీష్, నగేశ్, నాగేశ్వరరావు, డోన్‌వాన్ రవి, హమవంతు, రవికుమార్ తదితరులు ఉన్నారు.

జెడ్పీ చైర్మన్ పరామర్శ

కామేపల్లి: పండితాపురం గ్రామానికి చెందిన బొమ్మగాని పిచ్చయ్యపై మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు దాడి చేయగా తీవ్ర గాయాలపాలై ఖమ్మంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పరామర్శించి దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, రావూరి సతీష్ ఉన్నారు.

కేసీఆర్ కిట్ అందజేత

కామేపల్లి: కామేపల్లి పీహెచ్‌సీలో బిడ్డకు జన్మనిచ్చిన ఓ మహిళకు బుధవారం పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష కేసీఆర్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానాలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుష్పలత, ఆశలు పాల్గొన్నారు.

చేతి వృత్తులను ప్రోత్సహించండి



మేదర వస్తువులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఖమ్మంరూరల్: ప్రపంచ వెదురుగొంగల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జలగంనగర్‌లో జిల్లా మేదర సంఘం ఆధ్వర్యాన తయారు చేసిన వస్తువుల స్టాల్‌ను ఎంపీపీ రాజారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో కనుమరుగవుతున్న చేతివృత్తులను ప్రోత్సహించేందుకు వారి నైపుణ్యతను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేదర సంఘం జిల్లా కార్యదర్శి వాసం నాగేశ్వరరావు, సంఘం నాయకులు చందా మదారు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, ప్రసాద్, కోటయ్య, రైతు సంఘం నాయకులు వి.సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన



తెగుళ్లను పరిశీలిస్తున్న ఏఓ

కూసుమంచి: మండలంలోని భగవత్‌వీడు గ్రామంలోని వరి పొలాలను బుధవారం ఏఓ వాణి పరిశీలించారు. వరిలో అగ్గితెగులు, బాక్టీరియా ఎండాకు తెగులు సోకడంతో అట్టి తెగుళ్లను పరిశీలించి తగు సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఉపేందర్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు

మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల వద్ద బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని పూజలో పాల్గొనగా.. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. నవరాత్రుల సందర్భంగా గ్రామాల్లో భక్తులు కోలాటాలు, భజనలతో సందడి చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంవన్‌టౌన్: ఎస్ఆర్ హోమ్స్‌లో పూజలు చేస్తున్న తుంబూరు దయాకర్‌రెడ్డి దంపతులు



ఖమ్మంవ్యవసాయం: పిల్లి చిన్నకృష్ణ తోటలో పూజలు చేస్తున్న భక్తులు

ఆరు గ్యారంటీలతో అధికారం తథ్యం

ఖమ్మంవన్‌టౌన్: విజయభేరి సభలో సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని పీసీసీ సభ్యుడు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్ అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ హామీని విస్మరించలేదని, ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ కులం, మతం పేరుతో రాజకీయం చేస్తుందని ఆరోపించారు. మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నర్సింహారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల వారికి సమన్యాయం జరుగుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, సైదులునాయక్, మలీదు వెంకటేశ్వర్లు, ముజాహిద్ హుస్సేన్, మొక్కా శేఖర్‌గౌడ్, బొందయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జావీద్

గ్రామాల్లో గడగడపకూ కాంగ్రెస్..

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను ప్రజల్లోకి తీసుకవెళ్లేందుకు బుధవారం గడగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాజా సత్యనారాయణ, నాగండ్ల శ్రీనివాసరావు, హరినాథ్ షేక్ సైదులు, వీరబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెంలో బుధవారం గోపాలమిత్ర ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కోర్లకుంట్ల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈమేరకు 74 పశువులకు పరీక్షలు నిర్వహించి, 65 మేలుజాతి దూడలకు నట్టల నివారణ మందును తాగించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఈఓ కిశోర్, సర్పంచ్ తీగ ఉపేంద్రమ్మ, ఎంపీటీసీ పతానపు నాగయ్య, గోపాలమిత్రల సూపర్‌వైజర్లు శంకరయ్య, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన రాస్తారోకో

నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని కోరుతూ.. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మం–కోదాడ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పాలేరు ఇన్‌చార్జ్ నాగభూషణం మాట్లాడుతూ.. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుంటే ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సంఘం నాయకులు పొట్టపింజర బాలస్వామి, తోళ్ల వెంకన్న, వడ్లమూడి ప్రసాద్, మాదాసు వెంకన్న, రమేష్, బాలు, సామేలు, తోళ్ల విష్ణు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం ప్రారంభం

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామంలో డీకే ఎస్పీ వారి ఆధ్వర్యాన 'ఆదర్శ హోమ్'వృద్ధాశ్రమాన్ని బ్రదర్ శాంసన్ బుధవారం ప్రారంభించారు. కాగా, ప్రథమంగా గ్రామంలోని వృద్ధులను చేరదీసి వారికి వసతి, భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు మహంకాళి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సామ్యుల్‌రాజ్, త్యాగరాజు, కొక్కిరేణి ఎంపీటీసీ అంబేడ్కర్, కొమ్ము పూలే, బ్రదర్ మాచర్ల ఈశ్వర్‌రావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెంలో బుధవారం పౌష్టిక ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని 15 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ కవిత, కార్పొరేటర్ కూరాకుల వలరాజులు మాట్లాడుతూ.. పౌష్టికాహారంతో తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని, పండ్లు, ఆకు కూరలు, పాలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కాగా, గర్భిణులకు కార్పొరేటర్ చీరలు, గాజులు, పూలు అందించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సమీరా, సఖీ అడ్మిన్ సరిత, సూపర్‌వైజర్ కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం ఉండొద్దు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం సహకార పరపతి సంఘంలో కొత్త రైతాంగ రుణాల మంజూరులో రాజకీయ జోక్యాన్ని నివారించాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం తిరుమలాయపాలెంలోని గజ్జల వెంకటయ్య స్మారక భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాల కావాలంటే పార్టీ పేరు చెప్పమనడం సరికాదని, అర్హులైన రైతులందరికీ రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నాగేశ్వరరావు, రాయల సుందరయ్య, మందుల వెంకన్న, చిరంజీవి, వెంకటేష్, రాములు, ప్రభాకర్, మధు, రాజేష్ పాల్గొన్నారు.

ఎంవీపాలెంను మండల కేంద్రంగా చేయాలి

ఖమ్మంరూరల్: ఎంవెంకటాయపాలెంను మండల కేంద్రంగా చేయాలని కోరుతూ బుధవారం అఖిల పక్షం నాయకులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు నంద్ర ప్రసాద్, కళ్లెం వెంకటరెడ్డి మాట్లాడుతూ.. తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్లు ఒక్కొక్కటి ఒక్క దిక్కున ఉండడంతో ప్రజలు పనుల కోసం వెళ్లాలంటే ఆర్థిక భారంతో పాటు సమయం వృథా అవుతోందని పేర్కొన్నారు. ఈ విషయమై ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గమనించి కొత్తగా ఎంవీపాలెంను మండల కేంద్రంగా ప్రకటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు పి.సుధాకర్, మలీదు నాగేశ్వరరావు, రాంమూర్తినాయక్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు విశ్వ విద్యాలయం నుంచి హాస్య రచన విభాగంలో కీర్తి పురస్కారం అందుకున్న ఖమ్మం నగరానికి చెందిన కవి, రచయిత రాచమళ్ల ఉపేందర్‌కు ఈ నెల 24న అభినందన సభ నిర్వహిస్తున్నట్లు అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం అభినందన సభ పోస్టర్లను నిర్వాహకులు ఆవిష్కరించాక మాట్లాడారు. నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో సాయంత్రం 5 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొమిరే వెంకటేశ్వర్లు, మేడి రమేష్ పాల్గొన్నారు.

పాలాభిషేకం..



రఘునాథపాలెంలో పాలాభిషేకం చేస్తున్న సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తదితరులు

రఘునాథపాలెం: మండలంలోని ఆరు గ్రామాల పరిధిలోని డొంక రోడ్లకు పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.12.40 కోట్లు మంజూరుపై ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఈమేరకు రఘునాథపాలెం, వీవీపాలెం, జింకల తండా, కేవీబంజర, కోటపాడు, గణేశ్వరం గ్రామాల పరిధిలో సీఎం కేసీఆర్, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ గుడిపూడి శారద రామారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దినేని వెంకటరమణ, ఉప సర్పంచ్ కుందే సాహెబ్, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు గుడిపూడి రామారావుతో పాటు బాదావత్ నంద్యా, నల్లమోతు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు బీఎస్పీ మద్దతు

ఖమ్మంరాపర్తినగర్: గొర్రెల పంపిణీలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జీఎంపీఎస్ పిలుపు మేరకు రేపు(శుక్రవారం) కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు బీఎస్పీ మద్దతు ఇస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావుయాదవ్, జిల్లా అధ్యక్షుడు ఉపేందర్ సాహు, జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గొర్రెల పంపిణీలో వాటా ధనాన్ని ప్రభుత్వమే భరించాలని, డీడీలు వెనక్కు ఇచ్చి నగదు బదిలీ రూపంలో పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు, బీసీ బంధు పథకాలకు వాటాధనం లేకుండానే నిధులు ఇస్తూ.. గొర్రెల పంపిణీకి మాత్రం నిధులు ఎందుకు అడుగుతున్నారని నిలదీశారు. పట్టణ ప్రాంత యాదవులు, కురుమలకూ గొర్రెల పంపిణీ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో పలువురు బీఎస్పీ నేతలు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'స్వచ్ఛతా హీ సేవా'

నేలకొండపల్లి/ కామేపల్లి: మండలాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం నేలకొండపల్లి బౌద్ధక్షేత్రం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించగా.. విద్యార్థులు, గ్రామ దీపికలు, వివిధ శాఖల అధికారులు ర్యాలీ తీసి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే కామేపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, యువతకు, మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంపీడీఓలు కె.జమలారెడ్డి, విజయభాస్కరరెడ్డి, ఎంపీఓ సత్యనారాయణ, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు వజ్జా రమ్య, నేలకొండపల్లి పంచాయతీ కార్యదర్శి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు